కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -179 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 11-07-2026 శనివారం పేజీలు : 4

# భద్రాద్రి రాముడిపై ఆన

## మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

- రైతులకు రూ.1009 కోట్ల భరోసా
- ఖమ్మం నా రాజకీయ గుండెకాయ
- బీఆర్ఎస్‌కు మళ్లీ అవకాశం లేదు
- హరీశ్‌కు బీజేపీ సవాల్ విసిరిన సీఎం
- 44 గ్రామాలు మునగాలా?
- 182లో 117 సీట్లు గెలుస్తాం: రేవంత్



**న్యూస్ డెస్క్, 10 జూలై (బిఎన్ఎస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. చింతకాని మండలం జగన్నాథపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'రైతు ఆశీర్వాద సభ'కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేదిక నుంచి వానాకాలం సీజన్కు సంబంధించిన రైతు భరోసా తుది విడత నిధులు రూ.1009 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ నిధుల విడుదలతో ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం రూ.8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లయింది. ఇప్పటిదాకా 74 లక్షల మంది రైతులకు చెందిన 1.45 కోట్ల ఎకరాల భూములకు విజయవంతంగా పెట్టుబడి సాయం అందించామని సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు.

నా రాజకీయ ఎదుగుదలకు ఖమ్మమే గుండెకాయ..


సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. "నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం జిల్లా ఒక గుండెకాయలాగా నిలిచింది. 2023 జులైలో ఇక్కడ ఒక అద్భుతం జరిగింది. నాటి బీఆర్ఎస్ అహంకార పాలనను కాదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆనాడు ఉప్పెనలా జనం కాంగ్రెస్ వైపు వచ్చారు. సరిగ్గా 36 నెలల తర్వాత మళ్లీ అదే జులైలో ప్రజాపాలనను ఆశీర్వదించడానికి రైతాంగం మళ్లీ ఉప్పెనలా తరలివచ్చింది" అని హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనీయబోమని ఇక్కడి ప్రజలు ఒట్టు పెట్టారు. అందుకే ఆ పాపాల భైరవుడిని ఫాంహౌస్‌లో బంధించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కొంటావని కొందరు నన్ను అడిగారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే గంటాపథంగా చెప్పా. మేము అన్నట్టే ఎన్నికల్లో 64 సీట్లు సాధించాం. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు గెలిచి మా బలాన్ని నిరూపించుకున్నాం" అని గుర్తుచేశారు.

పాపాల భైరవుడు కేసీఆర్ ను ఫామ్ హౌస్?లో బంధించామని ఆ పాపాల భైరవుడికి ఇక విముక్తి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత ఎన్నికల్లో చెప్పి మరీ బీఆర్ఎస్‌ను పాతాళానికి తొక్కామని మళ్లీ చెబుతున్నా జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే అని.. కల్వకల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కేది మేమే అన్నారు. తెలంగాణ అసెంబ్లీకి 2028 డిసెంబర్ లో ఎన్నికలు జరగవని 2009 జూన్ లోనే ఎన్నికలు జరుగుతాయన్నారు.

మిగతాది 2 లో..

# ఏపీలో మళ్లీ కరోనా టెర్రర్

- కడపలో ఇద్దరు మృతి
- మరో ఐదుగురికి కోవిడ్ నిర్ధారణ
- పూణే ల్యాబ్‌కు శాంపిల్స్
- బాధిత ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే
- అధికారిక ప్రకటనపై ఉత్కంఠ




**న్యూస్ డెస్క్, 10 జూలై (బిఎన్ఎస్):** ప్రపంచాన్ని అతలాకుతలం చేసినా కరోనా వైరస్ ఆంధ్రప్రదేశ్ లో మళ్లీ కలకలం రేపుతోంది. తాజాగా కడప జిల్లాలో కోవిడ్ తరహా లక్షణాలతో ఇద్దరు మృతి చెందడం తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. జిల్లాలో ఇటీవల కొందరికి చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా, కడప నగరంతో పాటు రాజంపేట ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు కరోనా లక్షణాలతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

**పూణే ల్యాబ్‌కు శ్యాంపిల్స్..**

అయితే, మృతుల వివరాలు తెలిసిన వెంటనే వైద్య అధికారులు రంగంలోకి దిగారు.

# ఉత్తరాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు




- కొండచరియలతో పలువురు మృతి
- ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్
- చార్‌ధామ్ యాత్రకు అంతరాయం

# నాకు తెలంగాణే ఫస్ట్

## ఆ తర్వాతే పార్టీ:ఎంపీ ఈటల

- నీళ్ల విడుదలలో జాప్యంపై ఫైర్
- రైతులను కష్టాల్లో నెట్టొద్దు
- కాళేశ్వరంపై కాంగ్రెస్‌కు కౌంటర్
- రెండు పంటలకు కాళేశ్వరమే కారణం




**న్యూస్ డెస్క్, 10 జూలై (బిఎన్ఎస్):** ప్రజల విషయానికొస్తే.. తనకు తెలంగాణే ఫస్ట్ అని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగతమని.. తాను ఎవరో పలికిస్తే పలికే వ్యక్తిని కాదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసి తెలంగాణలోని ప్రాజెక్టుల్లోకి నీళ్లు వస్తున్నా.. ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా అన్నదాతలను కష్టాల పాలు చేయడం భావ్యం కాదన్నారు. వర్షాకాలం పంటలకు నీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద.. బోర్లు, బావులు లేకుండా పూర్తి స్థాయిలో వ్యవసాయం చేయడం సాధ్యం కాదన్నారు.

# ఈ20 పెట్రోల్‌పై కేంద్రం కీలక ప్రకటన




- మైలేజ్ 3-5% తగ్గే అవకాశం
- కాలుష్యం తగ్గుతుందని స్పష్టం
- ఇంజన్ పనితీరు మెరుగవుతుంది
- ఇంధన దిగుమతులపై ఆధారత తగ్గింపు
- బయోఫ్యూయల్‌కు కేంద్రం ప్రాధాన్యం
- 2001 నుంచే విస్తృత పరిశోధనలు

# రావణ్ కస్టడీ విచారణ వాయిదా




- 14కు కోర్టు తదుపరి విచారణ
- 10 రోజుల కస్టడీ కోరిన పోలీసులు
- కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ
- ఇరుపక్షాల వాదనలు 14న
- లోతైన విచారణకు పోలీసుల విజ్ఞప్తి
- కస్టడీపై అప్పుడే స్పష్టత

# హరీష్ రావుకు కాంగ్రెస్ 'ఆఫర్'




- బీఆర్ఎస్‌పై మహేష్ ఫైర్
- రూ.1,400 కోట్లపై ప్రశ్నలు
- ఈటల మౌనం ఎందుకు?
- పార్టీలో క్రమశిక్షణే ముఖ్యం
- 15న కీలక భేటీ..పదవులపై నిర్ణయం

**న్యూస్ డెస్క్, 10 జూలై (బిఎన్ఎస్):** బీఆర్ఎస్, బీజేపీలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా, పార్టీ అంతర్గత వ్యవహారాలపై పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేత హరీష్ రావును టార్గెట్ చేస్తూ పీసీసీ చీఫ్ ఘాటు విమర్శలు గుప్పించారు. "హరీష్ రావు గారు.. పదేళ్లు మంత్రిగా ఉండి మీరు ఏం చేశారు? ఇప్పుడు మళ్ళీ మూడు నెలల టైమ్ ఎందుకు ఇవ్వాలి? మీరు కట్టిన ప్రాజెక్టులు కుంగిపోయాయి. దానికి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి హరీష్ రావుకు మిట్ట మధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో "హరీష్ రావు మా పార్టీలోకి వస్తానని చెబితే, మా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పిఏసీ)లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం" అంటూ ఒక ఆసక్తికర వ్యాఖ్య చేశారు. బీఆర్ఎస్ నిధులపై స్పందిస్తూ.. కవిత చేసిన ఆరోపణల్లో నిజం ఉందన్నారు. ఒక రీజినల్ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని, దీనిపై ఖచ్చితంగా అనుమానాలు వస్తున్నాయని అన్నారు.

# సీఎంకు కంటి పరీక్షలు చేయాల్సిందే

- హైడ్రాపై ద్వంద్వ వైఖరి?
- ఓవైసీ కాలేజీలపై ప్రశ్నలు
- పేదలపైనే బుల్డోజర్లా?




# పుట్టబోయే ప్రతీ బిడ్డకు బంగారు ఉంగరం

- విజయ్ సంచలన హామీ
- కరూర్ ఘటనపై తీవ్ర ఆవేదన
- తొక్కిసలాటపై కుట్ర ఆరోపణలు
- అవినీతిపై కఠిన హెచ్చరిక
- డీలిమిటేషన్‌కు టీవీకే వ్యతిరేకం




**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. కరూర్‌లో గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటన తర్వాత ఆయన తొలిసారిగా ఇక్కడికి రావడంతో ఈ సభ ప్రాధాన్యత సంతరించుకుంది. సభలో విజయ్ మాట్లాడుతూ.. కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలోనే అతిపెద్ద విషాదమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందంటూ సీఎం విజయ్ సంచలన ఆరోపణలు చేశారు. "ఆ రోజు కరూర్ పోలీసులు మమ్మల్ని అప్రమత్తం చేయలేదు. అక్కడ తొక్కిసలాట జరిగే అవకాశం ఉందనే విషయం పోలీసులకు ముందే తెలుసు.

# బోనాలకు పటిష్ట ఏర్పాట్లు

- రూ.20 కోట్లతో ఘన నిర్వహణ
- జూలై 16న తొలి బోనం
- భక్తులకు అన్ని సౌకర్యాలు
- భద్రతకు ప్రత్యేక చర్యలు
- ప్రత్యేక బస్సులు.. లైవ్ కవరేజ్




**న్యూస్ డెస్క్, 10 జూలై (బిఎన్ఎస్):** ఆషాఢ బోనాల ఉత్సవాలతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహించి, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గోల్కొండ కోట ఆవరణలో అమ్మవారికి పూజలు నిర్వహించి బోనం సమర్పించిన అనంతరం, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆమె బోనాల ఏర్పాట్లపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మక గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి (ఎల్లమ్మ తల్లి) ఆలయం నుండి ఈ నెల 16న తొలి బోనం ప్రారంభం కానుందని తెలిపారు.

# రైలు ప్రయాణికులకు అలర్ట్

- స్క్రీన్‌షాట్ టికెట్లు ఇక చెల్లవు
- ఒరిజినల్ డిజిటల్ టికెట్ తప్పనిసరి
- రైలు బయల్దేరాక బుక్ చేస్తే చెల్లదు
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా
- అన్‌రిజర్వ్ టికెట్లకే వర్తింపు
- రైల్ వన్ యాప్‌తోనే ధృవీకరణ

2 లో

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్
11-07-2026

# హరీష్ రావుకు కాంగ్రెస్ 'ఆఫర్'

మొదటి పేజీ తరువాయి

ఈటల రాజేందర్ ఆ రోజు ఏం చేశారు?

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై కూడా మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాష్ట్రంలో నీళ్ల దోపిడీ జరిగినప్పుడు, ప్రజల సొత్తు దుర్వినియోగం అయినప్పుడు ఈటల బీఆర్ఎస్ (ఆనాటి టీఆర్ఎస్)లోనే ఉన్నారని, ఆర్థిక మంత్రిగా కూడా పనిచేశారని గుర్తుచేశారు. ఆనాడు జరిగిన తప్పిదాలను ప్రశ్నించకుండా మౌనంగా ఉన్న ఈటల.. ఇప్పుడు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ 12 ఏండ్ల బీజేపీ పాలనను ప్రజలు చూశారని, వారి గురించి తెలిసి ప్రజలు మళ్లీ గోతిలో పడరని అన్నారు. "జేపీ నడ్డా వచ్చినా.. ఎవరు వచ్చినా మాదొక్కటి సూటి ప్రశ్న. మీరు ఇస్తానన్న ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఈ రాష్ట్రానికి రావాలి" అని డిమాండ్ చేశారు. కేంద్రం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని, మీ 12 ఏళ్ల పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏంటని నిలదీశారు.

పార్టీలో క్రమశిక్షణ అందరికీ సమానమే..

కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయాలపై స్పందిస్తూ పార్టీలో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, అవన్నీ త్వరలోనే తొలగిపోతాయని స్పష్టం చేశారు. క్రమశిక్షణా కమిటీ అనేది అందరికీ సమానమేనని తేల్చిచెప్పారు. కడియం శ్రీహరి, కొండ సురేఖ, తుంగతుర్తి పంచాయతీ వ్యవహారాలపై ఇద్దరు సీనియర్ నాయకులను (సచిన్ సావంత్, జగ్గారెడ్డి) అబ్జర్వర్లుగా నియమించామని వెల్లడించారు. వారిద్దరూ క్షేత్రస్థాయి నుంచి విచారణ జరిపి పార్టీకి నివేదిక ఇస్తారని, ఆ తర్వాతే క్రమశిక్షణా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే కొంతమంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని సమర్థించుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలన బాగుందని, జనాలు తమను ఆదరిస్తున్నారని మహేష్ కుమార్ గౌడే ధీమా వ్యక్తం చేశారు. వేరే పార్టీలు తలుపులు తెరిచి ఉంచినా, మూసి ఉంచినా తమకు వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. ఇక పార్టీలో ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీపై కీలక అప్డేట్ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్లతో చర్చించి కార్పొరేషన్ పదవులపై తుది నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ ప్రకటించారు.

# భద్రాద్రి రాముడిపై ఆన..మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్, ఆయన కుమారుడు, అల్లుడు, కూతురు, భజన పరులు, ఒప్పంద పరులు, దొంగ సర్వేలు చేసే ఏజెన్సీలు సహా అందరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోకోండి.. వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ సీట్లు 25, అసెంబ్లీ 182కు పెరుగుతాయన్నారు. 182 సీట్లలో 117 సీట్లు గెలిచి రెండో సారి ప్రజాపాలన రాబోతోందన్నారు. భద్రాచలం రాముడి మీద ఆన.. ఇది కాంగ్రెస్ కార్యకర్తల మాట.. ఇది రాసి పెట్టుకో కేసీఆర్ అని శపథం చేశారు. కేంద్రంలోని బీజేపీ తమ పంతం నెగ్గించుకునేందుకు ప్రతిపక్షాలను చీల్చుతోందని దుయ్యబట్టారు.

బీజేపీతో హరీశ్ రావు మంతనాలు:

బీజేపీలోకి వెళ్లేందుకు మంతనాలు జరుపుతున్నారో లేదో హరీశ్‌రావు చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నేను బీజేపీలోకి వెళ్లబోనని వారితో బీజేపీతో మంతనాలు జరపడం లేదని హరీశ్ రావు భద్రాచలం రాముడు, కేసీఆర్ పై ఒట్టేసి చెప్పాలన్నారు. కాంగ్రెస్ సొంత సర్వేలో బీఆర్ఎస్ గెలవబోతోందని ఫలితం వచ్చిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం ఫైర్ అయ్యారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో ఇలాగే సర్వేల పేరుతో డబ్బా కొట్టుకున్నారు. కానీ ప్రజల తీర్పు మాకు అనుకూలంగా ఇచ్చారని, ఇప్పుడు మేము జరిపించిన సర్వేలో మాకు వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయని ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని సీట్లు ఉంటాయో? ఏ రిజర్వేషన్లు ఉంటాయో తెలియకుండానే ఎవరైనా సర్వేలు చేయిస్తారా అని ప్రశ్నించారు.

మీ రాజకీయాల కోసం గ్రామాలు మునగాలా?:

కన్నెపల్లి పంప్ హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతల మాటలపై సీఎం ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కన్నెపల్లి పంప్?లు ఆన్ చేస్తే భద్రాచలం రాముడి గుడి సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని మీ లుచ్చా రాజకీయాల కోసం భద్రాచలం రాముడు, గ్రామాలు మునగాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే మరొకరికి పడదని ధ్వజమెత్తారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని దుర్మార్గులు విష ప్రచారం చేశారు. శుక్రవారం నేను కల్వకుంట్లోళ్లను అడుగుతున్న ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పూట ఎప్పుడైనా కరెంట్ వైర్ ను పట్టుకో కాకిలా మాడి మసి అయిపోతారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అన్నారు.

2023లో అద్భుతం జరిగింది:

రాజకీయంగా పాలమూరు జిల్లా నాకు ప్రాణం అయితే నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం జిల్లా గుండెకాయలా పని చేసిందని సీఎం చెప్పారు. తెలంగాణలో గత పదేళ్లు రాక్షస పాలన సాగిందన్నారు. 2023 జులైలో ఒక అద్భుతం జరిగిందని బీఆర్ఎస్?ను కాదని పొంగులేటి కాంగ్రెస్?లో చేరారన్నారు. ఆనాడు ఉప్పెనలా జనం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. కానీ బీఆర్ఎస్ డబ్బు మూడలను తట్టుకుని మీరు ఆ ఎన్నికల్లో గెలవలేరని నాతో మీడియా ప్రతినిధులు అన్నారు. కానీ 65 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పాం గెలిచి చూపించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్?కు గుండుసున్నా వస్తుందని చెప్పాం అదే జరిగిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో 2/3 మున్సిపాలిటీల్లో 80 శాతం గెలిచాం. మళ్లీ ఖమ్మంలో బీఆర్ఎస్ విషపు మొక్కను మొలకెత్తనివ్వం అని చాటి చెప్పేందుకు చీమలదండై, ఉప్పెనలా వచ్చిన ప్రజలను చూసి నా గుండె పులకరించిపోయిందన్నారు.

30 నెలల్లో 1 లక్ష 70 వేల కోట్లు:

ప్రజాప్రభుత్వంలో రామరాజ్యం తీసుకువస్తామని సీఎం చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎవరికీ అన్యాయం జరగనివ్వం అన్నారు. నాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అంటే ఇవాళ మా ప్రభుత్వం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామన్నారు. రైతులను రాజును చేయాలనే ఉద్దేశంతో రైతుభరోసా నిధులు విడుదల చేశామన్నారు. 9 రోజుల్లో చివరి విడత డబ్బులు రైతు ఖాతాలో వేశామన్నారు. ఈ 30 నెలల్లో రైతుల కోసం వివిధ కార్యక్రమాల కోసం 1 లక్ష 70 వేల కోట్లు ఖర్చు పెట్టామని ఇంత ఖర్చు చేసిన ప్రభుత్వం మన దేశంలో మరే రాష్ట్రంలో చేయలేన్నారు.

భద్రాచలం రాముడిపై ఆన.. 2029లో 117 సీట్లతో మళ్లీ మనదే పీఠం!

భవిష్యత్తు ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం రాముడి సాక్షిగా సంచలన ప్రతిన పూనారు. "2029 జూన్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో పార్లమెంట్ సీట్లు 25కు, అసెంబ్లీ సీట్లు 182కు పెరుగుతాయి. ఆ 182 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే 117 సీట్లు గెలిచి, రెండోసారి సగర్వంగా ప్రజాపాలనను తీసుకొస్తుంది. భద్రాచలం రాముడీ మీద ఆన వేసి చెబుతున్నా.. ఇది కేవలం నా మాట కాదు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పూనిన ప్రతిన" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సీఎంకు కంటి పరీక్షలు చేయాల్సిందే
## టీఆర్ఎస్ చీఫ్ కవిత హాట్ సెటైర్లు

**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్రంలో 'హైడ్రా' కూల్చివేతల పర్వం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రక్షణ సేన చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్‌గా ట్విట్టర్ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అమలులో ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆమె మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని హైదరాబాద్‌లోని నిరుపేదలను రేవంత్ సర్కార్ బుల్డోజర్ల కింద నలిపేస్తోందని ధ్వజమెత్తారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన విద్యాసంస్థలను కాపాడటానికి ఏకంగా కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తోందని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

సీఎంకు కంటి పరీక్ష అవసరం..

ఒవైసీ విద్యాసంస్థల నిర్మాణాలు చెరువులను కబ్జా చేసి కట్టారనే విషయం స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. చెరువును కబ్జా చేసి కట్టిన కాలేజీ ప్రపంచమంతా చూస్తున్నా.. సీఎం రేవంత్ రెడ్డి కి మాత్రమే కనిపించడం లేదని అన్నారు. దీన్ని బట్టి చూస్తే తక్షణమే ఆయనకు కంటి పరీక్ష చేయించుకోవలసిన అవసరం ఉందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తూ, బడాబాబుల ఆక్రమణలను మాత్రం కాపాడుతున్నారని కవిత ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తిపోస్తుండటం స్టేట్ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

# నాకు తెలంగాణే ఫస్ట్..ఆ తర్వాతే పార్టీ:ఎంపీ ఈటల

మొదటి పేజీ తరువాయి

ఇది నీళ్లు, సాగుపై అవగాహన ఉన్నవారికి మాత్రమే తెలుస్తుందని ధ్వజమెత్తారు. తాను హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో.. ఎస్ఆర్ఎస్పీ నీళ్లు వచ్చినప్పుడు తూములు ఎత్తించి తమ నియోజకవర్గ రైతులకు హీరో అయ్యానని, ఒకవేళ అదే నీళ్లు వరంగల్ వాసులకు చేరకపోతే తనపై చిందులు తొక్కేవారని గుర్తు చేసుకున్నారు.

అంతకు ముందే జలయజ్ఞం: నీళ్ల కోసమే, నిధుల కోసమే, ఆత్మగౌరవం కోసమే ఉద్యమించిన చరిత్ర తెలంగాణదని.. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరై ఉండొచ్చు కానీ, మూలాలను మరిచిపోయినవాడు మనిషే కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. చాలా మంది చరిత్రను మరిచిపోయారని, కాళేశ్వరం కంటే ముందే వైఎస్సార్ హయాంలో జలయజ్ఞం ప్రారంభమైందని గుర్తు చేశారు. జలయజ్ఞంలో భాగంగా ఆయన తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నీళ్లను తీసుకురావాలని ప్లాన్ చేశారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాకే 24 టీఎంసీల సామర్థ్యంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. అప్పుడే మిడ్ మానేరు డ్యామ్ నిర్మాణం కూడా ప్రారంభమైందని తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, కొండపోచమ్మ ప్రాజెక్టు, మల్లన్న సాగర్.. ఇలా కాళేశ్వరం నీళ్లు చేవెళ్ల వరకు రావాలని మొదట ఆలోచన చేసింది కాంగ్రెస్ పార్టీనే అనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు.

కాళేశ్వరంతోనే సంపూర్ణంగా రెండు పంటలు: స్వరాష్ట్రం వచ్చాక రాష్ట్రానికి కడుపునిండా నీళ్లు ఉండాలనే ఉద్దేశంతో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి అన్నారం, అక్కడి నుంచి సుందిళ్ల, ఆ తర్వాత ఎల్లంపల్లికి నీళ్లు తరలించేలా ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆ ప్రాజెక్టుల ద్వారా వచ్చిన 29 టీఎంసీల నీళ్లే నేడు మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్నాయని తెలిపారు. రైల్వే జంక్షన్‌కు కాజీపేట ఎలాంటిదో.. ఇవాళ ఉత్తర తెలంగాణకు నీళ్ల అడ్డా మిడ్ మానేరు అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. పోచంపాడు ప్రాజెక్టులో 90 టీఎంసీలు, ఎల్ఎండీలో 24 టీఎంసీల కెపాసిటీ ఉన్నప్పటికీ, గతంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో ఒక్క పంటకు కూడా నీళు అందేవి కావని ఈటల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ అయ్యాక.. మిడ్ మానేరులోని 25 టీఎంసీల నీటితో పాటు పోచంపాడు ప్రాజెక్టు నీటిని కలిపి హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు కరీంనగర్ జిల్లా, వరంగల్ జిల్లా, నల్గొండ జిల్లాలోని కొంత భాగానికి సంపూర్ణంగా రెండు పంటలు పండుతున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, కాంట్రాక్టులు, డిజైన్ల మార్పుల గురించి తాను మాట్లాడటం లేదని.. కానీ, అసలు ఆ ప్రాజెక్టు కట్టడమే తప్పు అని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్న మాటలు దుర్మార్గమని అన్నారు. కాళేశ్వరం పరిధిలోని ప్రాజెక్టును రిపేర్ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, భయంకరమైన కరువు వస్తుందని తెలిసి కూడా ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వంపై ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏపీలో మళ్లీ కరోనా టెర్రర్

మొదటి పేజీ తరువాయి

కడప, రాజంపేట లోని బాధిత గ్రామాల్లో స్పెషల్ టీమ్స్ పర్యటించి, మృతుల కుటుంబ సభ్యులు, ప్రైమరీ కాంటాక్టుల వివరాలను సేకరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉన్నాయా అనే కోణంలో సర్వే నిర్వహిస్తున్నారు. మృతుల మరణానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు బాధితుల నమూనాలను సేకరించి, ఉన్నత విచారణ కోసం పూణే లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. ఇక్క మరో ట్విస్ట్ ఏంటంటే.. జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి, మరణాలపై ఇప్పటి వరకు వైద్య, ఆరోగ్య శాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం.


# ఉత్తరాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కొండచరియలు విరిగిపడగా.. పలువురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. యూపీలోని సంత్ కబీర్ నగర్, కుషినగర్, బులంద్ షహర్, షమ్లీ, ఘజియాబాద్ లలో వర్షాల కారణంగా కొందరు మరణించారు. భారీ వర్షాల ధాటికి నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండగా.. కొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 16 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవ్వగా.. సూరత్ లో రోడ్లు జలమయమై వాగులను తలపిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్ లో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు అలకనంద, మందాకిని నదులు పొంగి పొర్లుతుండగా.. మరోసారి అతిభారీ వర్షాల హెచ్చరికలు రావడంతో అధికారులు అప్రమత్తమై.. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలో స్కూళ్లను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్ లో 75 ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమవ్వగా.. 29 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వర్షాలు, గాలులకు పాడైనట్లు గుర్తించారు. భారీ వర్షాల నేపథ్యంలో చార్ ధామ్ యాత్రకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరకాశి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో గంగోత్రి హైవే మూసుకుపోయింది.

ఉత్తరప్రదేశ్ లోనూ నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ.. వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గాజియాబాద్, మేరఠ్, హాపూర్, బులంద్ షహర్, బాఘ్ పత్, ముజఫర్ నగర్, మొరాదాబాద్ జిల్లాల్లో స్కూళ్లకు ముందుగానే సెలవు ప్రకటించారు. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

# రైలు ప్రయాణికులకు అలర్ట్..




**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** రైల్వే స్టేషన్లలో కౌంటర్ల వద్ద క్యూలైన్లలో నిలబడే పనిలేకుండా డిజిటల్ అన్ రిజర్వ్ టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు ఇండియన్ రైల్వే డిపార్ట్మెంట్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇకపై ప్రయాణ సమయంలో రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసిన ఒరిజినల్ డిజిటల్ టికెట్ ను మాత్రమే చెల్లుబాటు అయ్యే టికెట్ గా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఇటీవల ఓ మహిళా ప్రయాణికురాలు వాట్సప్ స్క్రీన్ షాట్ చూపించగా.. రైలు కదిలిన తర్వాత ఆ టికెట్ బుక్ చేసినట్లు తేలింది. దీంతో టీసీ ఆమెకు ఫైన్ విధించారు. ఈ క్రమంలోనే రైల్వేశాఖ రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసే అన్ రిజర్వ్ టికెట్ల విషయం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది.

కొత్త రూల్స్ ఇవే.. ఇవి అస్సలు చెల్లవు!

రైల్వే బోర్డు సవరించిన నిబంధనల ప్రకారం.. టికెట్ స్క్రీన్ షాట్లు, మొబైల్ లో తీసుకున్న టికెట్ ఫొటోలు, పీడీఎఫ్ వర్షన్లు, వాట్సప్ లేదా ఇతర మెసేజింగ్ యాప్ ల ద్వారా పంపిన టికెట్లు చూపిస్తే.. వారిని టికెట్ లేని ప్రయాణికులుగా పరిగణించి భారీ జరిమానా విధిస్తారు. టికెట్ ను ఏ మొబైల్ నంబర్, ఏ ఫోన్ నుంచి బుక్ చేశారో.. రైలులో ప్రయాణించే సమయంలో అదే మొబైల్లో, అదే నంబరుతో యాప్ ఓపెన్ చేసి బుక్ చేసిన టికెట్ ను చూపించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం.. డిజిటల్ అన్‌రిజర్వ్డ్ టిక్కెట్లను ప్రయాణికుడు ఎక్కాల్సిన బోర్డింగ్ స్టేషన్ నుండి రైలు బయలుదేరడానికి ముందే బుక్ చేసుకోవాలి. రైలు స్టేషన్ వదిలి వెళ్లిన తర్వాత జనరేట్ అయిన ఏ డిజిటల్ టిక్కెట్ అయినా చెల్లదు. ఈ రూల్స్ కేవలం అన్ రిజర్వ్ టికెట్లకు మాత్రమే వర్తిస్తాయి. స్లీపర్, ఏసీ క్లాస్ వంటి రిజర్వ్ టికెట్లకు వర్తించవు. వాటిని ఆధార్, పాన్ కార్డు వంటి గుర్తింపు కార్డుల ద్వారా ధృవీకరిస్తారు.

# పుట్టబోయే ప్రతీ బిడ్డకు బంగారు ఉంగరం



**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. కరూర్‌లో గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటన తర్వాత ఆయన తొలిసారిగా ఇక్కడికి రావడంతో ఈ సభ ప్రాధాన్యత సంతరించుకుంది. సభలో విజయ్ మాట్లాడుతూ.. కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలోనే అతిపెద్ద విషాదమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందంటూ సీఎం విజయ్ సంచలన ఆరోపణలు చేశారు. "ఆ రోజు కరూర్ పోలీసులు మమ్మల్ని అప్రమత్తం చేయలేదు. అక్కడ తొక్కిసలాట జరిగే అవకాశం ఉందనే విషయం పోలీసులకు ముందే తెలుసు. అయినప్పటికీ మమ్మల్ని కావాలనే మీటింగ్ ప్రాంగణానికి తీసుకెళ్లారు" అని విజయ్ మండిపడ్డారు.

పాలనలో విశ్వరూపం చూపిస్తాం..

ఇదే వేదికపై నుంచి విపక్షాలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో తమను చూసి విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతికి తావులేదని, అవినీతికి పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 'టీవీకే' పాలన ఎలా ఉంటుందో, ప్రభుత్వ విశ్వరూపం ఏంటో ప్రజలకు త్వరలోనే చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం విజయ్ పునరుద్ఘాటించారు. అందులో భాగంగానే.. రాష్ట్రంలో త్వరలో పుట్టబోయే బిడ్డలకు తమ ప్రభుత్వం తరపున బంగారు ఉంగరాలు అందిస్తామని ఒక వినూత్న ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కరూర్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఈ20 పెట్రోల్‌పై కేంద్రం కీలక ప్రకటన




**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** :ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణే టార్గెట్‌గా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ20 పెట్రోల్ పై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ ను మిక్స్ చేయడం వల్ల వాహనాల మైలేజీ 3 నుంచి 5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్రం అధికారికంగా పేర్కొంది. అయితే, మైలేజీ తగ్గుదల కంటే ఙు20 ఇంధనం ద్వారా దేశానికి, పర్యావరణానికి చేకూరే ప్రయోజనాలే చాలా ఎక్కువని అధికారులు స్పష్టం చేశారు. ఈ20 పెట్రోల్ వాడకంతో కాలుష్యం భారీగా తగ్గడమే కాకుండా, వాహనాల ఇంజన్ పనితీరు మరింత మెరుగై పికప్ కూడా పెరుగుతుందని వెల్లడించింది.

మరోవైపు బయోఫ్యూయల్ విధానంతో దేశంలో స్వదేశీ ఇంధన భద్రత గణనీయంగా పెరుగుతుందని కేంద్రం స్పష్టం చేసింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురుపై ఆధారపడటం క్రమంగా తగ్గుతూ వస్తుందని పేర్కొంది. ఈ20 ఇంధన వినియోగం, దాని భద్రతపై ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేదని.. 2001 నుంచే దీనిపై సుదీర్ఘంగా పరిశోధనలు, పరీక్షలు జరుగుతున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది.

# రావణ్ కస్టడీ విచారణ వాయిదా



**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** యూట్యూబర్ రావణ్ కస్టడీ పిటిషన్‌పై కోర్టులో విచారణ ఈ నెల 14వ తేదీకి వాయిదా పడింది. రావణ్‌ను విచారించేందుకు తమకు 10 రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగించాలని గన్నవరం పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన కోర్టు తదుపరి విచారణను 14వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఆ రోజున రావణ్ కస్టడీకి సంబంధించిన అంశంపై ఇరువర్గాల న్యాయవాదులు కోర్టులో తమ బలమైన వాదనలను వినిపించనున్నారు. పోలీసులు కోరినట్లు 10 రోజుల కస్టడీకి కోర్టు అనుమతిస్తుందా లేదా అనే అంశంపై ఈ నెల 14న జరిగే విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన అనంతరం న్యాయస్థానం తన తుది నిర్ణయాన్ని వెల్లడించనుంది.

కాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హిందువుల మనోభావాలు కించపరిచిన కేసులో బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో రావణ్‌ను మరింత లోతు విచారణ చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రావణ్ ను కస్టడీకి ఇవ్వాలని అనుమతి కోరారు.

# బోనాలకు పటిష్ట ఏర్పాట్లు




**న్యూస్ డెస్క్,10 జూలై (బిఎన్ఎస్):** ఆషాఢ బోనాల ఉత్సవాలతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహించి, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గోల్కొండ కోట ఆవరణలో అమ్మవారికి పూజలు నిర్వహించి బోనం సమర్పించిన అనంతరం, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆమె బోనాల ఏర్పాట్లపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మక గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి (ఎల్లమ్మ తల్లి) ఆలయం నుండి ఈ నెల 16న తొలి బోనం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ ఉత్సవాల కోసం సీఎం రూ. 20 కోట్ల నిధులను మంజూరు చేశారని వెల్లడించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు ప్రతి ఆది, గురువారాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయని, 16న ఉదయం లంగర్ హౌస్ క్రాస్ రోడ్ నుండి గోల్కొండ కోట వరకు భారీ ఊరేగింపు నిర్వహించి, ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తామని చెప్పారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీకేడ్లు ఏర్పాటు చేయాలి. మహిళా భక్తుల రక్షణ కోసం మహిళా పోలీసులు, షీ టీమ్స్ నిరంతరం పర్యవేక్షించాలి. సీసీ కెమెరాలు, టోల్ ఫ్రీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి. విద్యుత్, జీహెచ్ఎంసీ: రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా నిరంతర సరఫరా అందించాలి, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలి. ఉత్సవాలకు ముందే పారిశుధ్య పనులు పూర్తి చేసి, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి, సురక్షిత క్యూలైన్లు నిర్మించాలి, మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు, వైద్యాధికారులను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ఫైర్ ఇంజన్ల అప్రమత్తత, సమాచార శాఖ ద్వారా లైవ్ కవరేజ్, ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలలో హిందూ ముస్లింలు భాయ్ భాయ్‌గా కలిసి పాల్గొంటారని పీస్ కమిటీ ప్రాధాన్యతను గుర్తుచేశారు. చిన్న ఆలయాలకు ఇచ్చే రూ. 5 వేల ఆర్థిక సాయం సరిపోవడం లేదని, దానిని రూ. 10 వేలకు పెంచేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. అనంతరం వారు బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, డీసీపీలు కాజల్ సింగ్, రాఘవేందర్ రెడ్డి, ఈవో వసంత, ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆలయ మాజీ చైర్మన్లు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటిన సైబరాబాద్ పోలీసులు




మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జూలై 8, 9 తేదీల్లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్--2026లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్లస్టర్--ఏ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి మొత్తం 37 పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని విజేతలను ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేశారు.

ఈ క్రీడా పోటీల్లో సైబరాబాద్ పోలీసులు 9 స్వర్ణ పతకాలు, 8 రజత పతకాలు, 20 కాంస్య పతకాలు సాధించి మొత్తం 37 పతక ఈవెంట్లలో విజయం నమోదు చేశారు. యోగా, ఆర్మ్ రెజ్లింగ్, వుషు, తైక్వాండో, బాక్సింగ్, కరాటే, జిమ్నాస్టిక్స్, పెన్‌చక్ సిలాట్, పవర్‌లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ తదితర వ్యక్తిగత, జట్టు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, విధులు నిర్వహిస్తూనే పరిమిత సమయంలో సాధన చేసి ఇంతటి విజయాన్ని సాధించడం అభినందనీయమని అన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అన్ని క్రీడల్లోనూ కొనసాగించి సైబరాబాద్ పోలీసుల కీర్తి పతాకాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, క్రీడా సామగ్రి, ఇతర సౌకర్యాల కల్పనకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

పోలీస్ ఉద్యోగంలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా ఎంతో ముఖ్యమని, క్రీడలు ఒత్తిడిని తగ్గించి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడతాయని సీపీ తెలిపారు. ప్రతి పోలీసు ఉద్యోగి ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. ప్రస్తుతం పతకాలు సాధించిన క్రీడాకారులు మరెందరికో స్ఫూర్తిగా నిలిచి కొత్త ప్రతిభను వెలికితీయాలని అన్నారు. క్రీడలు వ్యక్తులనే కాదు, దేశాల మధ్య కూడా స్నేహం, ఐక్యత, పరస్పర అవగాహనను పెంపొందించే గొప్ప వేదిక అని పేర్కొన్నారు. పోలీసు శాఖలో కూడా క్రీడా స్ఫూర్తితో కలిసి పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించ వచ్చని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ పుష్ప, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో ‘ఆపరేషన్ ముస్కాన్’: 146 మంది చిన్నారుల రక్షణ

గచ్చిబౌలి (బిఎన్ఎస్): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. మహిళా మరియు శిశు సంరక్షణ విభాగం డీసీపీ కె. సృజన తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 3 నుండి జూలై 9 వరకు షీ టీమ్స్ నగరంలోని వివిధ బహిరంగ ప్రదేశాలలో 114 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాయి. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వేధింపులకు పాల్పడుతున్న 33 మందిని షీ టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. వీరిలో తీవ్రతను బట్టి 34 పెట్టీ కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి పోలీసుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ వారంలో వివిధ మార్గాల ద్వారా బాధితుల నుండి 13 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు.

మరోవైపు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అపహరణకు గురైన చిన్నారుల రక్షణ కోసం సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రత్యేకంగా ‘ఆపరేషన్ ముస్కాన్’ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలో 30 జేజే యాక్ట్, బాలకార్మిక కేసులను పోలీసులు నమోదు చేశారు. వివిధ ప్రాంతాల్లో శ్రమదోపిడీకి గురవుతున్న 146 మంది చిన్నారులను సురక్షితంగా రక్షించారు. అలాగే కుటుంబ కౌన్సిలింగ్ కేంద్రాల ద్వారా భార్యాభర్తల మధ్య ఉన్న కుటుంబ కలహాలను పరిష్కరించి, 21 కుటుంబాలను పోలీసులు విజయవంతంగా తిరిగి ఒకటి చేశారు.

నేరాల నియంత్రణ, ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా ఏహెచ్‌టీయూ, షీ టీమ్స్ సంయుక్తంగా సైబరాబాద్ వ్యాప్తంగా పలు అవగాహన సదస్సులు నిర్వహించాయి. ఈ కార్యక్రమాల్లో దాదాపు 4,516 మంది ప్రజలు పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ బుల్లీయింగ్ మరియు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100 మరియు




సైబర్ క్రైమ్స్ నంబర్ 1930 ల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలు వీటిని ఎలా ఉపయోగించుకోవాలో పోలీసులు అవగాహన కల్పించారు.

# కడప కలెక్టరేట్ ముందు అంగన్వాడీలు భారీ ధర్నా!!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 10:

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టారు. భారీ సంఖ్యలో అంగన్వాడీలు హాజరయ్యారు. డిమాండ్ల పరిష్కారానికి ఐసిడిఎస్పిడి సమాధానం చెప్పాలని పట్టుపట్టారు. ధర్నా వద్దకు పిడి రాకపోవడంతో అంగన్వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. కొంతమంది కలెక్టరేట్ గేటును ఎక్కారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి యూనియన్ ప్రతినిధులను లోనికి అనుమతించారు. ఐసిడిఎస్ ఈవో నాగేశ్వరి ధర్నా వద్దకు చేరుకుని సమస్యలను పిడి దృష్టికి తీసుకువెళతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన ఇప్పటికీ అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించలేదని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలతో భారీ ధర్నా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. అంగన్వాడి, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు అమలు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న మినీ సెంటర్



లను మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్ కి ఐదు సంవత్సరాల సీనియార్టీ నిబంధన రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలిపారు. పని భారం పెంచే నవ చేతన యాప్ ను రద్దు చేయాలని చెప్పారు. పెండింగ్ లో ఉన్న టిఏ బిల్లులు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని తెలిపారు. 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, మినిట్స్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దానినే చేయడం లేదని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆశా, మధ్యాహ్నం భోజనం, వివోఏ, స్కీం వర్కర్లకు వేతనాలు పెరగలేదని చెప్పారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతనాలు సవరించాలని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ.. అంగన్వాడీల సత్తా ఏమిటో గత, ప్రస్తుత ప్రభుత్వాలకు తెలుసని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వ విధానాల వలన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ పథకానికి కేవలం రూ. 21,900 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు రకరకాల యాపులు తెచ్చి ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ.. హెల్పర్ల ప్రమోషన్ విషయంలో రాజకీయ జోక్యం తగదని హెచ్చరించారు. అంగన్వాడీలకు పని భారం పెరిగి మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలలో పౌర సేవలను ప్రైవేటు వారికి అప్పగించాలని తీసుకువచ్చిన జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, నాయకులు అంజలీదేవి, గౌసియా, విజయ, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

# నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముహూర్తం ఖరారు

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 10:

కడపజిల్లా నందలూరులో వెలసిన ప్రాచీన, ప్రసిద్ధ శ్రీ సౌమ్యనాథ స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. జూలై 21 నుండి 31 వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా జూలై 14 న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జూలై 21వ తేదీన అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. జూలై 22న ధ్వజారోహణం, జూలై 26న గరుడసేవ, జూలై 28న ఉదయం కల్యాణోత్సవం, జూలై 29న రథోత్సవం, జూలై 30న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, క్యూలైన్లు, ఫ్లెక్సీలు, ఆర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు వాహన సేవల సందర్భంగా భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదనంగా మొబైల్ మరుగుదొడ్లు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది, వాహన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేపట్టాలని సూచించారు.

భక్తులు పెద్ద సంఖ్యలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కటాక్షానికి పాత్రులు కావాలని ఈవో కోరారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ



కార్యక్రమంలో జేఈవో డా.ఎ. శరత్, సిఈ టివి. సత్యనారాయణ, డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వాహనసేవల విశేషాలు

జూలై 22 ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలి వాహనం, జూలై 23 ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, జూలై 24 ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహ వాహనం, జూలై 25 ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, జూలై 26 ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, జూలై 27 ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, జూలై 28 ఉదయం 10 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి గజ వాహనం, జూలై 29 ఉదయం 9 గంటలకు రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, జూలై 30 ఉదయం చక్రస్నానం, రాత్రిధ్వజావరోహణం, జూలై 31 సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం..

ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు అవకాశం

జూలై 28వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవంలో గృహస్తులు ఇద్దరు రూ.500/- చెల్లించి పాల్గొనవచ్చు. పాల్గొనే దంపతులకు ఒక ఉత్తరీయం, ఒక రవికెతో పాటు అన్నప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు.

ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత, హరికథ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తనున్నారు.

# పెంచలకోనలో వైభవంగా శ్రీవారి తిరుప్పావడ సేవ

## ప్రతి శుక్రవారం ప్రత్యేక సేవలు

## రూ.500/- తో సేవా టికెట్ పొందే అవకాశం

## మనమిత్ర’ వాట్సప్ యాప్ ద్వారా సేవల బుకింగ్: ఈఓ జనార్ధన్ రెడ్డి



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నందు శుక్రవారం సందర్భంగా శ్రీ నరసింహస్వామి, శ్రీ ఆదిలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున 5:00 గంటలకు శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం జరిపారు. అనంతరం ఉదయం 9:00 గంటలకు శ్రీ స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ (కార్యనిర్వహణాధికారి) కొవ్వూరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రంలో ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక సేవలు నిరంతరాయంగా జరుగుతాయని తెలిపారు. ఈ సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500/- చెల్లించి రశీదు పొంది సేవలో పాల్గొన్న భక్తుల పేరున గోత్రనామాలతో అర్చన జరిపి, స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు 1 కేజీ పులిహోరను భక్తులకు ప్రసాదముగా అందజేశారు. భక్తులకు స్వామివారి సేవలు మరింత త్వరగా, సులభతరంగా అందుబాటులోకి తెచ్చేందుకు దేవస్థానం వారు సరికొత్త సాంకేతికతను జోడించారు. భక్తులు ‘మనమిత్ర’ వాట్సప్ నెంబర్ (9552300009) ద్వారా శ్రీవారి సేవల్లో డిజిటల్‌గా పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించవచ్చని ఈఓ తెలిపారు. ఈ అద్భుత అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

# అమ్మవారి పాలెం భక్తుల పాదయాత్రకు పచ్చిగళ్ళ రత్నయ్య సంఘీభావం



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం అమ్మవారి పాలెం గ్రామం నుండి తిరుమల శ్రీవారి దర్శనార్థం 250 మంది భక్తులతో ప్రారంభమైన 11వ వార్షిక పాదయాత్ర శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం రాపూరు మండలంలోకి అడుగుపెట్టిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చిగళ్ళ రత్నయ్య రాపూరు మండలంలో భక్తుల పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. కలియుగ వైకుంఠనాథుడైన వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులకు ఆయన తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. గత 11 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో అమ్మవారి పాలెం గ్రామస్తులు తిరుమలకు పాదయాత్ర నిర్వహించడం ఎంతో అభినందనీయం. ఆ శ్రీవారి ఆశీస్సులు భక్తులందరిపై, అలాగే నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. భక్తులను ఉత్సాహపరుస్తూ పచ్చిగళ్ళ రత్నయ్య కూడా వారితో కలిసి కొంతదూరం పాదయాత్రలో నడిచారు. భక్తులకు కావలసిన మౌలిక వసతులు, ప్రసాద వితరణ తదితర విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఆవుల రాజేంద్ర, గిరిబాబు, ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొని భక్తులకు తమ సంఘీభావం తెలిపారు.

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి రామనారాయణరెడ్డితో కేక్ కట్ చేయించి తినిపించారు. ఆయురారోగ్యాలతో ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు.



# జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన నిఖిల్


## దృష్టివికలాంగ చిన్నారులకు అండగా నిలిచిన హోంమంత్రి తనయుడు



విజయవాడ ,బిఎన్ఎస్ జులై 10:- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత కుమారుడు నిఖిల్, తన పుట్టినరోజును భిన్నంగా, అర్థవంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌ను సందర్శించిన నిఖిల్, దృష్టివికలాంగ చిన్నారులకు స్వయంగా పోషకాహారం, తాజా పండ్లు అందించారు. అంతేకాక, పాఠశాలకు 15 ఫ్యాన్లు, 25 కాట్ బెడ్స్‌ను కూడా అందజేసి, చిన్నారుల సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచారు. విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విద్యార్థులతో కలిసి సమయం గడుపుతూ, వారి నవ్వుల్లోనే తన పుట్టినరోజు ఆనందాన్ని వెతుక్కున్నారు. ఆర్భాటాలకు దూరంగా, సేవలోనే సంతృప్తిని వెతుక్కున్న నిఖిల్ తీరు స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సముద్ర మథనం దేశ భవిష్యత్తుకు అవసరం-దూడల పెంచలయ్య



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సముద్ర మథనం దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమని రాపూరు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య పేర్కొన్నారు. భారతదేశం ఇతి హాసలలో సముద్ర మథనం చేసి అమృతాన్ని సాధించారని అదేవిధంగా నేడు కేంద్ర ప్రభుత్వం సముద్ర మంథన్ పేరుతో సముద్ర మథనం చేసి దేశ భవిష్యత్తు అవసరాలు తీర్చడానికి చమురు, గ్యాస్ నిక్షేపాలు కనుకొంటుంది అని,అదేవిధంగా ఇటీవల అండమాన్ నికోబర్ దీవుల దగ్గర భారీ గ్యాస్ మరియు చమురు నిక్షేపాలు బయటపడ్డాయి అని ఇవి దేశ అవసరాలకు ఉపయోగ పడుతాయి అని,అదేవిధంగా రాజస్థాన్ లోని జైసల్మేర్ దగ్గర ఆయిల్ నిక్షేపాలు, కేజీ బేసిన్,తమిళనాడు లోని కావేరి బేసిన్, కాస్ట్ ఆఫ్ కేరళ, అస్సాం లో దిగబై లో ఆయిల్ వెలికాతితలు జరుగుతున్నాయి. అదేవిధంగా సముద్ర మథనం పూర్తి స్థాయిలో జరిగి ఆయిల్ రంగంలో2047నాటికి స్వయం సమృద్ధి సాధించాలని కోరుకుందాం అని రాపూరు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య ప్రకటనలో తెలిపారు.

# హామీలు ముందా... విస్తరణ ముందా.?




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 10: కడపజిల్లా.. జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండల పరిధిలోని చిన్నకొమెర్ల గ్రామం వద్ద 2004 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించిన దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ నేటికీ 22 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. అయితే ప్రస్తుతం దాల్మియా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రెండో ప్లాంట్ పనుల విస్తరణకు రంగం సిద్ధం చేసుకుంటుంది. ఈ క్రమంలో గతంలోనే దాల్మియా సిమెంట్ పరిశ్రమ ప్లాంట్ ఒకటి తోనే దుగ్గనపల్లె, నవాబుపేట, చిన్నకొమెర్ల గ్రామాలకు తీవ్రని నష్టం జరుగుతుందని, అనేకమార్లు దుగ్గనపల్లె, నవాబుపేట, గ్రామ ప్రజలు రాజకీయ నాయకులకు మరియు జిల్లాస్థాయి ఉన్నత అధికారులకు, లోకాయుక్తకు తెలిపిన విషయం విధేయతమే.. అయితే ప్రస్తుతం ప్లాంట్ టు పరిశ్రమ విస్తరణ ప్రారంభ ప్రక్రియ మొదలుతో ముఖ్యంగా దుగ్గనపల్లె, నవాబుపేట గ్రామ ప్రజల సమస్యలను తీర్చిన తర్వాతే విస్తరణ పనులు మొదలు పెట్టాలని ఇవాళ జమ్మలమడుగు ఆర్డిఓ శిరీష కు నవాబుపేట, దుగ్గనపల్లె, చిన్నకొమెర్ల గ్రామస్తులు వినతి పత్రాన్ని సమర్పించారు. దాల్మియా విస్తరణ నేపథ్యంలో రైతుల భూములు, గ్రామాల పునరావాసం, వరద ముంపు, కాలుష్యం, బ్లాస్టింగ్ నష్టాలపై ప్రజలకు పర్యావరణ, కాలుష్య రహిత సభలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ తో వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతే దాల్మియా విస్తరణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. హామీల అమలును విస్మరించి విస్తరణ పనులను ప్రారంభించే ప్రయత్నం చేస్తే, ఈ నెల 15 న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దాల్మియా ప్లాంట్ టు విస్తరణ పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న సందర్భంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేసి పర్యటనను అడ్డుకుంటామని నవాబుపేట, దుగ్గనపల్లె, చిన్నకొమెర్ల గ్రామాల ప్రజల తరపున భాస్కర్ రెడ్డి మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు విరాళంగా అందజేసిన రేగొండ ఎస్సై సుధాకర్ దంపతులు



**బిఎన్ఎస్ భూపాలపల్లి రేగొండ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) డి.సుధాకర్ - స్పందన దంపతులు శుక్రవారం వినూత్న రీతిలో తమ ఉదారతను చాటుకున్నారు.అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారి బాలబాలికల సౌకర్యార్థం వారు 15 ప్లాస్టిక్ కుర్చీలను విరాళంగా అందజేశారు.ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు నేలపైనే కూర్చుని అక్షర జ్ఞానాన్ని నేర్చుకునేవారని,ఇప్పుడు ఎస్సై దంపతుల చొరవతో తమకు కుర్చీలు సమకూరడంపై చిన్నారులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కుర్చీలపై కూర్చుని చదువుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని చిన్నారులు మురిసిపోయారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రజిత మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, చిన్నారుల పౌష్టికాహారానికి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ప్రయత్నాలకు తోడుగా సమాజంలోని దాతలు కూడా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్పందించి, వసతుల కల్పనకు తోడ్పడిన ఎస్సై సుధాకర్ - స్పందన దంపతులకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి స్థానిక దాతలు, చిన్నారుల తల్లిదండ్రులు తమ వంతు సామాజిక బాధ్యతగా సహకరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్ శ్రీలత, మహిళా సంఘం అధ్యక్షురాలు సుమలత,చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ప్రగతి పథం

## వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ ఆధ్వర్యంలో వేగంగా అభివృద్ధి పనులు..!




విశాఖపట్నం(బిఎన్ఎస్):: ముఖ్యమంత్రి ఆశయాలు, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విశాఖపట్నం మహానగరాన్ని అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు విశాఖ మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (VMRDA) సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ నేతృత్వంలో నగరంలో మౌలిక వసతుల కల్పన, పర్యాటక రంగాల ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ అనుసంధాన రహదారులపై ప్రత్యేక దృష్టి :

నిర్మాణ దశలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా రూపుదిద్దుకుంటున్న ఏడు ప్రాధాన్య మాస్టర్ ప్లాన్ రహదారుల పనులపై కమిషనర్ తేజ్ భరత్ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎక్కడా నాణ్యత లోపించకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడు రహదారులు అందుబాటులోకి వస్తే విశాఖపట్నం -- భోగాపురం మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి (NH-16) పై ట్రాఫిక్ రద్దీ భారీగా తగ్గుతుందని అధికారులు వెల్లడించారు.

ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా కైలాసగిరి

విశాఖపట్నం పర్యాటక రంగంలో తలమానికమైన కైలాసగిరి కొండను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు వీఎంఆర్‌డీఏ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. రాబోయే అంతర్జాతీయ ఈవెంట్లను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేశారు.

ప్రధాన ఆకర్షణలు.. ప్రణాళికలు:

మతపరమైన, సాంస్కృతిక ఆకర్షణ: కొండపై 55 అడుగుల ఎత్తైన భారీ త్రిశూలం, డమరుకం నిర్మాణం.

రవాణా సౌకర్యాలు: పర్యాటకుల సౌకర్యార్థం పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ షటిల్ బస్సుల ఏర్పాటు, కొత్త అంతర్గత రహదారుల నిర్మాణం.

సౌకర్యాల విస్తరణ: పెరుగుతున్న పర్యాటకుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ స్థలాల విస్తరణ, అదనపు హంగుల కల్పన.

భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పట్టణ ప్రణాళిక:

కేవలం పర్యాటకం, రహదారులకే పరిమితం కాకుండా వీఎంఆర్‌డీఏ పరిధిలోని అన్ని పార్కుల అభివృద్ధి, బృహత్తర ప్రణాళిక (Master Plan) సమర్థవంతమైన అమలు, పాత పర్యాటక ప్రాంతాల ఆధునీకరణపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. భవిష్యత్ నగర జనాభా మరియు విస్తరణ అవసరాలను అంచనా వేస్తూ పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు.

వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో కమిషనర్ ఎన్. తేజ్ భరత్ పనులను పరుగులు పెట్టిస్తుండటంతో, విశాఖపట్నం అతి త్వరలోనే మరింత ఆధునిక రూపాన్ని సంతరించుకోనుందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# తిరుమలగిరిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరి బైండోవర్

## రాత్రి వేళల్లో కారణం లేకుండా తిరిగితే చర్యలు తప్పవు: రేగొండ ఎస్సై డి.సుధాకర్ హెచ్చరిక




**బిఎన్ఎస్ భూపాలపల్లి రేగొండ**

రేగొండ మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.శుక్రవారం వారిని రేగొండ తహసీల్దార్ (ఎమ్మార్వో) ఎదుట హాజరుపరిచి,శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండేందుకు బైండోవర్ చేసినట్లు ఎస్సై దాసరి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామాల్లో రాత్రి వేళల్లో నేరాల నియంత్రణ,భద్రతా చర్యల్లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ వ్యక్తులు పట్టుబడినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండల ప్రజలను ఉద్దేశించి ఎస్సై సుధాకర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.రాత్రి సమయాల్లో గ్రామాల్లో ఎవరూ కూడా అనుమానాస్పదంగా బయట తిరగకూడదని స్పష్టం చేశారు.సరైన కారణం లేదా అత్యవసర పని లేకుండా అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై సంచరిస్తే సహించేది లేదన్నారు.నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వారిని గుర్తించి,అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయడంతో పాటు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలందరూ పోలీసులకు సహకరించి,గ్రామాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా తక్షణమే సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

# పెద్ద తండా (ఎం) గ్రామ సర్పంచ్ భర్త జోక్యంపై ఎంపీడీవోకు ఫిర్యాదు



**బిఎన్ఎస్ జనగామ, జూలై 10**

జనగామ మండలం పెద్ద తండా (ఎం) గ్రామపంచాయతీలో సర్పంచ్ స్వరూప భర్త శ్రీనివాస్ అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్థులు ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ పరిపాలన, అభివృద్ధి పనులు, పాలనా నిర్ణయాల్లో ఎన్నిక కాని వ్యక్తి జోక్యం చేసుకోవడం వల్ల గ్రామ పాలన దెబ్బతింటోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన అధికారిక వ్యవహారాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు మాత్రమే వ్యవహరించాలని, ఎన్నిక కాని వ్యక్తులు అధికారాలను వినియోగించడం పంచాయతీ రాజ్ చట్టానికి విరుద్ధమని గ్రామస్థులు తెలిపారు.ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు నిర్ధారించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను వారు కోరారు. గ్రామంలో పారదర్శక పరిపాలన కొనసాగేందుకు అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గూగులోత్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ గూగులోత్ బొజ్జా నాయక్, లచ్చిరాం నాయక్, మాజీ ఉపసర్పంచ్ గూగులోత్ వాలు నాయక్, గ్రామ పెద్దలు భూక్యా మోతీలాల్, గూగులోత్ బిక్కు నాయక్, భూక్యా శంకర్, భూక్యా రాజేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ తదితరులు పాల్గొని ఫిర్యాదు పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

# బహుజన కళాకారుల సమావేశాన్ని విజయవంతం చేయండి

## వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ మడిపడిగ చంద్రశేఖర్




**బిఎన్ఎస్ వరంగల్, జూలై 10**

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో బహుజన కళాకారుల ఐక్యత, సాంస్కృతిక చైతన్యం మరియు భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 12వ తేదీ (ఆదివారం) ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బహుజన కళాకారుల సమావేశం నిర్వహించనున్నట్లు వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ మడిపడిగ చంద్రశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహుజన కళాకారులు, జానపద కళాకారులు, గాయకులు, కవులు, రచయితలు, సాంస్కృతిక కార్యకర్తలు, అలాగే బహుజన భావజాలాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ ఆదేశాల మేరకు వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని జిల్లాల పార్టీ బాధ్యులు తమ తమ ప్రాంతాల్లోని బహుజన కళాకారులు, రచయితలు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులకు సమాచారం అందించి, అధిక సంఖ్యలో సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బహుజన సమాజంలో సామాజిక చైతన్యం, సమానత్వ భావనను పెంపొందించడంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కళాకారుల ఐక్యత, సాంస్కృతిక ఉద్యమ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత విస్తరణ వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.అందువల్ల బహుజన ఉద్యమానికి అండగా నిలిచే ప్రతి కళాకారుడు, రచయిత, సాంస్కృతిక కార్యకర్త బాధ్యతగా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జూలై 15, 16న గ్రామ పంచాయతీల ఎదుట రైతాంగ నిరసనలు

## దేవాదుల జలాలను లిఫ్టింగ్ చేసి జనగామకు సాగు, తాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్




**బిఎన్ఎస్ జనగామ, జూలై 10**


దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను వెంటనే నింపి రైతులకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జూలై 15, 16 తేదీలలో జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట రైతాంగ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ పిలుపునిచ్చారు.ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో మాట్లాడిన భూక్యా చందు నాయక్, ఒకప్పుడు జనగామ ప్రాంతం తీవ్ర కరువు ప్రాంతంగా ఉండేదని, రైతాంగ పోరాటాల ఫలితంగానే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం చిత్తశుద్ధితో గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ ప్రాంతానికి అందించడం లేదని ఆరోపించారు. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.జిల్లాలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీరు లేక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయని, ప్రభుత్వం నిర్దేశించిన సాగు లక్ష్యానికి అనుగుణంగా పంటల సాగు జరగడం లేదన్నారు. బోరు బావులు ఎండిపోవడంతో వరి నాట్లు, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.తీవ్ర ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచిస్తున్నప్పటికీ వాటికీ ఆరుతడి నీరు అవసరమేనని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీరు లేక బోరు బావులు కూడా ఎండిపోతున్నాయని, వెంటనే దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య, నాయకులు మంగ బీరయ్య, నక్క యాకయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీలత, బెల్లంకొండ వెంకటేష్, గండి అంజయ్య, మోకు భవాని, ఎడబోయిన రవీందర్ రెడ్డి, రాయపురం బిక్షపతి, పయ్యాముల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి :జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## క్యాచ్ ది రెయిన్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్ విజయవంతం చేయాలని పిలుపు.. జల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహణ

**బిఎన్ఎస్ భూపాలపల్లి**

జల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని, కురిసే ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసిపట్టి భావి తరాలకు నీటి కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలశక్తి అభియాన్ (జే ఎస్బి ఏ) 3.0 లో భాగంగా, జిల్లాలో ఈ నెల 6 నుండి ఆగస్టు 5 వరకు నిర్వహిస్తున్న 'క్యాచ్ ది రెయిన్' నెల రోజుల ఇంటెన్సివ్ క్యాంపెయిన్‌పై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్ జాతీయ జల మిషన్ 'జల ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఈ క్యాంపెయిన్ పురోగతిని ప్రధానమంత్రి కార్యాలయం ప్రతిరోజూ పర్యవేక్షిస్తోందని,కావున అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు, విద్యాసంస్థలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో ప్రజలందరితో జల ప్రతిజ్ఞ చేయించాలని స్పష్టం చేశారు.నీటిని ఒక అమూల్యమైన సంపదగా భావించి పొదుపుగా వినియోగించాలని, వర్షపు నీటి నిల్వలు



పెంచేందుకు ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్, పంట గుంతల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.ఈ జల సంరక్షణ పనుల వివరాలను విధిగా నిబంధనల ప్రకారం జేఎస్ జబి 3.0 పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.జాతీయ జల మిషన్ లక్ష్యం నెరవేరాలంటే జల సంరక్షణను ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలని, ఇందుకోసం మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో బ్యానర్లు, వాల్ పెయింటింగ్స్,మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. అనంతరం అధికారులతో కలిసి జలసిరి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.